## క్లుప్తంగా

### శ్రామిక వర్గం సంఘటితం కావాలి

**గుండాల:** దేశ వ్యాప్తంగా ఉన్న విప్లవ పార్టీలు, శ్రామిక వర్గం సంఘటితం అయి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు గుమ్మడి నర్సయ్య, రాయల చంద్రశేఖర్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం న్యూడెమోక్రసీ పార్టీ నుంచి ప్రజాపంథాలోకి చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఉండే విప్లవ పార్టీలు కలిసి ఉండాల్సిన అవసరం గుర్తించి విలీన బహిరంగ సభ మార్చి 3వ తేదీన ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా 4, 5వ తేదీలలో జాతీయ మహాసభలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు ప్రజాపంథా (మాస్‌లైన్) పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈసం శంకర్, మాచర్ల సత్యం, కొమరం శాంతయ్య, వాంకుడోత్ అజయ్, ఆవుల కిరణ్, పాయం వెంకన్న, గణేష్, మంగయ్య, తెల్లం రాజు, సనప కుమార్, నరేష్, కృష్ణ, వాగ్య, ఆల్యా, సతీష్ పాల్గొన్నారు.

### వైస్ ఎంపీపీపై అవిశ్వాసానికి వినతి

**అశ్వాపురం:** అశ్వాపురం వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రంపై అవిశ్వాసం కోరుతూ ఎంపీటీసీలు మంగళవారం భద్రాచలంలో ఆర్డీఓ మంగీలాల్‌ను కలిసి అవిశ్వాస కాపీని అందజేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ వీరభద్రంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు, టీడీపీకి చెందిన ఒక ఎంపీటీసీ ఎనిమిది మంది సంతకాలతో అవిశ్వాస కాపీని ఆర్డీఓకు అందజేశారు. మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసానికి సిద్ధం కావడంతో త్వరలో అధికారులు అవిశ్వాసంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, ఎంపీటీసీలు తుళ్లూరి గంగాభవాని, ఏనిక రవి, గాదె జయ, కొమరం చిట్టెమ్మ, బేతం రామకృష్ణ పాల్గొన్నారు.

### బాల కార్మికులను రక్షించిన పోలీసులు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలో వివిధ దుకాణాల్లో పని చేస్తున్న ఇద్దరు బాల కార్మికులను పట్టణ పోలీసులు మంగళవారం రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. చర్ల రోడ్డులోని బ్యాటరీ షాపులో ఓ బాలుడిని, కూనవరం రోడ్డులోని పండ్ల దుకాణంలో ఓ బాలుడిని గుర్తించి.. పనులు చేయిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

### ‘ఎస్సై దురుసుగా వ్యవహరించారు..!

**ములకలపల్లి:** కుటుంబ సమస్యల నేపథ్యంలో పోలీసులను ఆశ్రయించిన వివాహితపట్ల ఎస్సై రాజమౌళి దురుసుగా వ్యవహరించారంటూ అఖిలపక్ష నాయకుల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ములకలపల్లికి చెందిన ఓ మహిళ తన భర్త వేధిస్తున్నారని ఇటీవల ఠాణాకు వెళ్లగా కౌన్సెలింగ్ పేరిట ఎస్సై అనుచితంగా ప్రవర్తించారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ సోషల్ మీడియాలో ఆరోపించారు. ఈవిషయమై ఎస్సై రాజమౌళిని వివరణ కోరగా.. తాను దంపతులకు కౌన్సెలింగ్ మాత్రమే ఇచ్చానని, ఎవరిపట్ల దురుసుగా వ్యవహరించలేదని తెలిపారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ

**మణుగూరురూరల్:** సింగరేణి ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్(1630/1982) బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం ఏరియా జీఎం రామచందర్ జీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తమ పరిధిలోని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం వీసం కృష్ణయ్య, ఐఈడీ జె.శ్రీనివాసరావు, ఎకౌంట్ ఆఫీసర్స్ పసుల రమేష్, సీనియర్ సూపరింటెండెంట్ యనమల భద్రయ్య, అసోసియేషన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు మేకల ఈశ్వర్, కార్యదర్శులు పీక శంకర్, కాసర్ల అనిల్, క్యాలెండర్ ప్రచురణ కర్త, అంబేడ్కర్ జాతీయ అవార్డ్ గ్రహీత మందాడి సంజీవరావు, బూర్గుల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

### సర్పంచ్‌లు, ఉత్తమ అధికారులకు సన్మానం

**అశ్వారావుపేటరూరల్:** సర్పంచ్‌లు, ఉత్తమ అధికారులను ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచ్‌ల ఐదేళ్ల పదవి కాలం ముగుస్తున్న నేపథ్యంలో మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను, అలాగే ఇటీవలె జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఉత్తమ అధికారులుగా అవార్డులు పొందిన వివిధ శాఖలకు చెందిన 17 మంది అధికారులను ఆయన చేతుల మీదుగా శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేశారు. తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ ఫణీంద్ర, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె.పాషా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# మహాత్ముడికి ఘన నివాళి

మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో వితరణలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంలో గాంధీజీ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఆయన ఆనాడు చేసిన పోరాటాల ఫలితంగా నేడు మనం స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో జీవిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కరకగూడెం: ప్రతిజ్ఞ చేస్తున్న గాంధీ స్మారక నిధి ట్రస్ట్ సభ్యులు, నాయకులు, విద్యార్థులు


మణుగూరురూరల్: గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పాయం


అశ్వారావుపేటరూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళి..


భద్రాచలంటౌన్: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మదర్ థెరిస్సా ట్రస్ట్ సభ్యులు


అన్నపురెడ్డిపల్లి: మహాత్ముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


అశ్వారావుపేటరూరల్: గాంధీబొమ్మ సెంటర్‌లో వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..


దుమ్ముగూడెం: గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# పౌష్టికాహారాన్ని అందించాలి

**భద్రాచలం:** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఐటీడీఏ డీడీ మణెమ్మ అన్నారు. మంగళవారం ఐటీడీఏ సమీపంలోని గిరిజన భవనంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఆహార పదార్థాల తయారీ, పరిశుభ్రతపై శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కుక్, కామాటిలు, నాలుగో తరగతి సిబ్బంది, డైలీ వేజ్ వర్కర్లు, ఔట్సోర్సింగ్ వర్కర్లు కలిసి వంట చేసిన పదార్థాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నమ్మకంతో హాస్టల్స్‌లలో చేరిన గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని అన్నారు. వర్కర్లు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి వండిన వంటకాలను హెచ్‌ఎం, వార్డెన్లు రుచిచూచిన తర్వాతనే పిల్లలకు వడ్డించాలని ఆదేశించారు.


వంటల తయారీని పరిశీలించి మాట్లాడుతున్న డీడీ మణెమ్మ

పాఠశాలల పరిసరాలు, వంటగది, డైనింగ్ హాల్, డార్మెటరీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, ఇల్లెందు ఏటీడీఓ రూపాదేవి, భద్రాచలం ఏటీడీఓ నరసింహారావు, మెడికల్ సిబ్బంది, హెచ్‌ఎంలు, హెచ్‌డబ్ల్యూఓలు, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# అభాగ్యులను ఆదుకోవడమే లక్ష్యం

**కరకగూడెం:** గాంధీ స్మారక ట్రస్ట్ ద్వారా అభాగ్యులకు ఆదుకోవడమే తమ ముందున్న లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర గాంధీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవీ సుబ్బారావు, బోర్డు కమిటీ మెంబర్లు మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, సూర్య నాయక్, రంగారావులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డు సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు మాట్లాడుతూ.. కరకగూడెం మండలంలో 999 ఎకరాల గాంధీ స్మారక ట్రస్ట్ భూములు ఉన్నాయని ఇందులో మండల అభివృద్ధి కోసం ట్రస్ట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ, ఆయుర్వేదిక్, పశువైద్యశాలలకు, సొంత ఇళ్లులేని రాయణపేట గ్రామస్థులకు, గాంధీనగర్ వాసులకు వందల ఎకరాల భూములను ఇచ్చి ఆదుకున్నామని పేర్కొన్నారు. రాయణపేటలోని 125 మంది రైతులకు వందల ఎకరాలు ఇచ్చినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్న సుమారు మూడు ఎకరాల స్థలంలో మండలంలోని విద్యార్థులకు ఉపయోగపడేలా కాలేజీ కోసం ఇవ్వనున్నట్లు తెలిపారు.

అనంతరం గాంధీ పుస్తకాలను కరకగూడెం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం మంజులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు బాపిరాజు, ప్రొఫెసర్ సుబ్రమాణ్యం, రామానుజస్వామి, స్థానిక సర్పంచ్ ఊకె రామనాథం, చందా సంతోష్, మేనేజర్ నాగబండి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు బుడగం రాము, కొంపెల్లి రామలింగం, చిట్టి ప్రసాద్, శ్రీను, గొగ్గలి నర్సయ్య, కొమరం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆదరిస్తే అభివృద్ధి చేస్తా..


భద్రాచలంటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణ నాయక్

**భద్రాచలంటౌన్:** మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున తప్పకుండా తనకే టికెట్ వస్తుందని, భద్రాచలం నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తే ఈ ప్రాంత అభివృద్ధి చేస్తానని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణ నాయక్ అన్నారు. భద్రాచలంలోని హరిత హోటల్‌లో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సామాజిక కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం భద్రాద్రి అభివృద్ధి పేరుతో వేల కోట్లు నిధులు ప్రకటించడం తప్ప అభివృద్ధి చేసింది శూన్యమని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, గతంలో భద్రాచలం వచ్చిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడి గిరిజనుల సమస్యలపై ఢిల్లీలో పోరాడటానికి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో గుగులోత్ బీమా నాయక్, తేజావత్ వాసు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

**అశ్వారావుపేటరూరల్:** రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా సర్పంచ్‌కు తీవ్ర గాయాలు కాగా అపస్మారస్థితిలోకి వెళ్లిన ఘటన మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌ల పదవి కాలం ముగుస్తున్న సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని తిరుమలకుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ సున్నం సరస్వతీ హాజరై, సన్మానం అనంతరం తిరిగి తన స్వగ్రామానికి తన భర్త మాజీ సర్పంచ్ సున్నం రామలక్ష్మయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఊట్లపల్లి దగ్గర అదుపుతప్పి ఆమె కింద పడిపోయారు. దాంతో సరస్వతీ తల భాగంలో తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికు తరలించారు. వైద్యులు చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికు తరలించారు.

**ద్విచక్రవాహనదారుడికి..**

**అశ్వాపురం:** మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. బూర్గంపాడుకు చెందిన కొండా శ్రీను బైక్‌పై ఐస్‌క్రీమ్స్ అమ్ముతుంటాడు. యథావిధిగా మంగళవారం బైక్‌పై వెళ్తుండగా జగ్గారం గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని శ్రీనుకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# కుష్ఠు వ్యాధిపై అవగాహన

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో మంగళవారం కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించి ప్రజలకు కుష్ఠు వాధిపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి వ్యాధి నిర్మూలకు ప్రతిజ్ఞ చేశారు. మానవహారాలు చేపట్టారు. వైద్యులు మణిదీప్ మాట్లాడుతూ.. కుష్ఠు అనేది ప్రాణాంతకమైనది కాదని, దాన్ని ముందుగానే గుర్తిస్తే ఒక చర్మవ్యాధిలా భావించి చికిత్స ద్వారా నివారించవచ్చని వివరించారు. ఆశావర్కర్లు ప్రతి ఇంటికీ తిరిగి, అనుమానితుల వివరాలు సేకరిస్తారని తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యుడు మణిదీప్


దుమ్ముగూడెం: ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ రేణుకారెడ్డి


చంద్రుగొండ: జెడ్పీపాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు


అన్నపురెడ్డిపల్లి: కుష్ఠు వ్యాధి నివారణపై మానవహారం చేస్తున్న విద్యార్థులు


బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

### బహుజన సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక

**అశ్వారావుపేట:** మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కలపాల మంగరాజు అనే యువకుడు బహుజన సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక అయ్యాడు. మంగళవారం ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా ఎంపిక పత్రాన్ని అందించారు. ఈ అవార్డును ఫిబ్రవరి 11వ తేదీన ఏపీలోని తిరుపతిలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానంతో గడిచిన 9 ఏళ్లుగా సమాజంలోని అసమానతలను తొలగించేందుకు కృషి చేస్తునందుకు ఈ అవార్డుకు ఎంపికైనట్లు మంగరాజు తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**అశ్వారావుపేటరూరల్:** మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కలకోటి వెంకటేశ్వరరావు తండ్రి కలకోటి సుబ్బారావు(80) మంగళవారం చెందగా.. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ దారా యుగంధర్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు జేకేవీ రమణారావు, సంకా ప్రసాద్ పాల్గొన్నారు.

### సమ్మె నోటీస్

**దమ్మపేట:** అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని కోరుతూ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు శ్రీదేవి, మాధవిలకు సమ్మె నోటీసులను అందజేశారు. మంగళవారం మండల పరిధిలోని అంగన్వాడీలు, తమ వేతనాలను కనీసం 26 వేల రూపాయలకు పెంచాలని కోరుతూ, సూపర్వైజర్లకు సమ్మె నోటీసులను అందజేశారు. కేంద్ర బడ్జెట్‌లో అంగన్‌వాడీలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు సూరమ్మ, జయ, జ్యోతి, పద్మ, విజయలక్ష్మి, శాంతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి

**బూర్గంపాడు:** పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

### పండ్లు పంపిణీ

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని మానవసేవ వృద్ధాశ్రమంలో మంగళవారం పాలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక కూనవరం రోడ్డులో నేతాజీ ఆస్పత్రిని నూతనంగా ప్రారంభించిన సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది వృద్ధులకు పాలు, పండ్లు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు సరోజమ్మ, సంతోష్, సాయి, నీలిమ, ప్రియ, మమత, లావణ్య పాల్గొన్నారు.

### నిధులు కేటాయించాలి

**భద్రాచలంటౌన్:** ప్రభుత్వ పాఠశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మునిగడప రామాచారి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు అన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11, 12న ఖమ్మంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు భద్రాచలంలోని పాఠశాలల ఉపాధ్యాయులను మంగళవారం కలిసి ఆహ్వానించారు.

### ఎస్పీని కలిసిన అఖిలపక్ష నాయకులు


జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్‌ను సత్కరిస్తున్న అఖిలపక్షం నాయకులు

**ములకలపల్లి:** ములకలపల్లికి చెందిన పలువురు అఖిలపక్ష నాయకులు ఎస్పీ రోహిత్‌రాజ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మలకలపల్లి మండలంలోని నెలకొన్న స్థానిక సమస్యలను ఎస్పీకి వివరించారు. సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు నరాటి ప్రసాద్, టీఆర్‌ఎస్ నాయకులు పువ్వాల మంగపతి, పుష్పాల చందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### సీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు

**బూర్గంపాడు:** మండల కేంద్రం బూర్గంపాడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో మెరుగైన వైద్యసేవలను అందించేందుకు చర్యలు తీసుకున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలేష్‌కుమార్ అన్నారు. బూర్గంపాడు సీహెచ్‌సీలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఏడుగురు ప్రత్యేక వైద్య నిపుణులను ప్రభుత్వం నియమించిందన్నారు. 24గంటల పాటు రోగులకు వైద్యసేవలను అందించేందుకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఎముకలు, కీళ్ల నిపుణులు, దంత వైద్య నిపుణులు, షుగర్ వ్యాధి నిపుణులు, మత్తు నిపుణులు, శస్త్ర చికిత్స నిపుణులు, చిన్న పిల్లల వైద్యనిపుణులు, జనరల్ ఫిజిషియన్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నారన్నారు. మండల ప్రజలు వైద్యసేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఆస్పత్రి వైద్యులు అనిత, ప్రసాద్, జయ, సీహెచ్ శ్రీకాంత్‌రెడ్డి, సరిత, నీరజ, సుకన్య, శాంతిప్రియ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాసేవ సంతృప్తినిచ్చింది..

**ములకలపల్లి:** ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి లభించిందని పలువురు సర్పంచ్‌లు అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం మరో రెండు రోజుల్లో ముగియనున్న నేపద్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సత్కారాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీపీ మట్ల నాగమణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు మాట్లాడారు. కరోనా వంటి ప్రకృతి విపత్కర సమయంలో స్థానికులు అండగా నిలవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలపరిధిలోని 20 జీపీలకు చెందిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. దుశ్శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీను, ఎంపీఓ లక్ష్మయ్య, ఎంపీపీ మట్ల నాగమణి దుశ్శాలువకప్పి ఆత్మీయంగా సన్మానించారు. ఎంపీడీఓ బి.శ్రీను, ఎంపీఓ లక్ష్మయ్య, ఎంపీటీసీలు, జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

**మణుగూరురూరల్:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ.. ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకోవాలన్నారు. త్వరలో జరగబోయే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు విద్యార్థినీ, విద్యార్థులు సమాయత్తమై అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యేను అధ్యాపకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, ఎంపీటీసీ కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ పి.శంకర్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నలుగురిపై కేసు నమోదు

**భద్రాచలంఅర్బన్:** పట్టణంలోని పాత మార్కెట్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా నడిరోడ్డుపై రెండు లారీలను నిలిపి వస్తువులను దుకాణంలోకి దిగుమతి చేస్తున్న ఇద్దరు లారీ డ్రైవర్లతో పాటు రెండు దుకాణాల నిర్వహకులపై టౌన్ ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదు చేశారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

రోడ్డుభద్రత వారోత్సవాల సందర్భంగా పలు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆటోడ్రైవర్లు, ఇతర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని అన్నారు. వాహనాలపై నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, ఆటోలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై పోలీస్ స్టేషన్ నంబర్ తప్పనిసరిగా ఉంచాలని తెలిపారు. ధ్రువపత్రాలు లేని వాహనాలు పట్టుబడితే వాటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించారు. – సాక్షి నెట్‌వర్క్


పినపాక: వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివప్రసాద్


భద్రాచలంటౌన్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్


మణుగూరురూరల్: మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి